అప్పన్నను దర్శించుకున్న మంత్రి రవీంద్ర

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి వారిని అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర, పశ్చిమ నియోజకర్గం ఎమ్మెల్యే గణబాబు తదితరులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికి, స్వామివారి ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి స్వామివారి తీర్థ ప్రసాదాలను ఏఈఓ ఆనంద్ కుమార్ అందజేశారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మరిపిల్ల పైడిరాజు

విశాలాంధ్ర - విశాఖ: రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుకగా 6078 కోట్ల రూపాయల మేర పెంచిన విద్యుత్ ఛార్జీల వల్ల సామాన్య ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతుందని, తక్షణమే పెంచిన ఛార్జీలు రద్దు చెయ్యాలని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ ఏపీఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయం వద్ద మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య కుటుంబాలు, రైతులు, చిన్న వ్యాపారులు ఇప్పటికే ధరల పెరుగుదలతో సతమతమవుతున్నారని, ఈ పరిస్థితుల్లో నవంబరు 1వ తేదీ నుండి విద్యుత్ ఛార్జీలు యూనిట్‌కు రూ. 1.58 పైసలు పెంపు వల్ల వారి జీవనం మరింత కష్టంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఛార్జీల పెంపు వల్ల ఉమ్మడి విశాఖ జిల్లాలో 25 లక్షల మంది వినియోగదారులపై అదనంగా 15 కోట్లు రూపాయలు భారం పడుతుందని తెలిపారు. విద్యుత్ ఛార్జీల పెంపు ప్రభావం సాధారణ వినియోగదారులపై మాత్రమే కాకుండా, చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధిపై ఆధారపడిన వారిపై కూడా పడుతుందని అన్నారు. ఛార్జీలను పెంపు చేసే విధానం పారదర్శకంగా లేదన్నారు. సామాన్యులు రోజువారీ ఖర్చుల భారం భరించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యుత్ ఛార్జీల భారం ఇతర అవసరాలను తగ్గించుకునే పరిస్థితికి దారితీస్తుందని తెలిపారు. అనంతరం జనరల్ మేనేజర్ వి.విజయలలితకి సీపీఐ ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సత్యాంజనేయ, జీఎస్‌జె అచ్యుతరావు, కె.సత్యనారాయణ, ఎస్‌కె రెహమాన్, ఎం.మన్మధరావు, ఆర్.శ్రీనివాసరావు, సిఎస్ క్షేత్రపాల్ రెడ్డి, ఎంఎ బేగం, కె.వనజాక్షి, ఎ.దేముడమ్మ, బి.పుష్పలత, కె.అచ్యుతరావు, వై.రాంబాబు, ఎస్.అప్పన్న, కె.లక్ష్మణరావు, సీహెచ్ కాసుబాబు, ఎన్.సూరిబాబు, ఎం.శ్రీనివాసరావు, ఎ.రవి, జి.కాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరశురాంకు డాక్టరేట్

విశాలాంధ్ర - మల్కాపురం: జర్నలిజంలో ఎన్నో ఒడిదుదుకులను ఎదుర్కొని అవినీతి అక్రమాలపై అక్షరాలను ఆయుధాలుగా సందిస్తూ 18 ఏళ్ల పాటు పాత్రికేయునిగా ప్రజల పక్షాన పోరాడి అక్షర కలంతో విశేష సేవలందించినందుకు గాను నేషనల్ న్యూస్ ఎక్స్‌ప్రెస్ ఎడిటర్ కొయిలాడ పరుశురాం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో డాక్టర్ చిన్నారావు వెల్ఫేర్ సొసైటీ చారిటబుల్ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ గ్లోబల్ శాంతి విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంజేపీ గురుకుల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - సింహాచలం: ఈనెల 24, 25 తేదీల్లో కర్నూలు జిల్లా డిఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఎంజేపి గురుకుల కళాశాల విద్యార్థులు తమ చక్కటి ప్రతిభను కనబరిచారు. ఈ క్రీడల్లో రాష్ట్ర నలుమూలల నుంచి వేల మంది విద్యార్థులు అథ్లెటిక్స్ విభాగంలో పాల్గొన్నారు. అయితే అందులో సింహాచలం గురుకుల కళాశాలకు చెందిన జట్టు సాగర్ అండర్ 19 విభాగంలో లాంగ్ జంప్‌లో 6.2 మీటర్లు దూకి మొదటి స్థానం సంపాదించారు. అలాగే ఎస్.జయ వర్ధన్ అనే విద్యార్థి 110 మీటర్స్ హర్డిల్స్ విభాగంలో తృతీయ స్థానం సంపాదించాడు. విజయనగరం జిల్లా కొత్తవలసలో 25, 26, 27 తేదీల్లో భారత్ డిఫెన్స్ అకాడమీలో నిర్వహించిన అండర్ 19 హ్యాండ్‌బాల్ టోర్నమెంట్లో వేచలపు మధు అనే విద్యార్థి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు అండర్ 19 స్కూల్ గేమ్స్ సెక్రటరీ శ్రీలక్ష్మి తెలిపారు. ఇంతటి చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ రమ మోహిని, అధ్యాపక సిబ్బంది అభినందించారు. సహకరించిన వ్యాయామ ఉపాధ్యాయులు కె.దుర్గాప్రసాద్, డి.అప్పారావును అభినందించారు.

రూ.1.99 కోట్ల నిధులతో రహదారులు

పనులను పరిశీలించిన కార్పొరేటర్ స్టాలిన్

విశాలాంధ్ర - గాజువాక: జీవీఎంసీ 72వ వార్డు వంద అడుగుల రోడ్డులో రూ. 1.99 కోట్ల రూపాయలు నిధులతో బి.టి రోడ్డు కోసం పనులు ప్రారంభ మయ్యాయి. గాజువాక పోలీస్ స్టేషన్ కూడలి నుండి జగ్గు సెంటర్ కూడలి వరకు ఇరువైపులా బీటీ రోడ్లు పనులు ప్రారంభమయ్యాయని వార్డు కార్పొరేటర్ ఏ.జె స్టాలిన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం కార్పొరేటర్ స్టాలిన్ బి.టి రోడ్లు పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వార్డు పరిధిలో ప్రజల మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామని అన్నారు. అలాగే శ్రీనగర్ సోషల్ వెల్ఫేర్ కాలనీలో స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ.ఈ మల్ల సూరి అప్పారావు, వర్క్ ఇన్స్పెక్టర్ సుధాకర్, ఏమినిటీ సెక్రటరీ వంశి, సిపిఐ నాయకులు జి.ఆనంద్ పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఏఐటీయూసీ

ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో నేతలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆరిలోవ కాలనీ పినాకిల్ గ్రౌండ్ దగ్గర గల ముత్యమాంబ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ ఆరిలోవ జోన్ అధ్యక్షులు పిల్లి వీర్రాజు, ఆటో రిక్షా కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ ముఖ్యఅతిథిగా హాజరై ఏఐటీయూసీ పతాకావిష్కరణ చేశారు. అనంతరం డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ డ్రైవర్లు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాలని, విధిగా ఖాకీ చొక్కా ధరించాలని, మద్యం త్రాగి వాహనం నడపారాదని, ఆటోలో పరిమితికి మించి పాసింజర్లను ఎక్కించ రాదని, ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీస్ వారికి సహకరించాలని, ప్రధానమైన ఆటో డ్రైవర్ల సంక్షేమ చట్టం అమలుకై డ్రైవర్లంతా పోరాటానికి సిద్ధమవ్వాలని తెలియజేశారు. అక్టోబర్ 31న సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద జరిగే ఏఐటీయూసీ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు మధురెడ్డి, కరకరమణ, అప్పారావు, సింహాచలం, గోవిందరెడ్డి, అశోక్ సభ్యులు పాల్గొన్నారు.

రక్షణ దళాలలో చేరేందుకు మహిళలు ఆసక్తి

విశాలాంధ్ర - మధురవాడ: దేశంలోని రక్షణ దళాలలో చేరే మహిళల సంఖ్య క్రమేపి పెరుగుతోందని అలాగే ఇంజనీరింగ్, వైద్య విద్యను పూర్తి చేసిన యువతరం దేశ సేవ కోసం ముందుకు రావడం అభినందించతగ్గ విషయమని లెఫ్టినెంట్ కల్నల్ వై. హెచ్.వి.ఎస్.ప్రసాద్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కెరీర్ గైడెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. రాజస్థాన్, బీహార్, జమ్ముకాశ్మీర్, కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి గీతంలో ప్రవేశం పొంది ఎన్‌సిసిలో ప్రతిభ చాటుతున్న విద్యార్థులను ఆయన అభినం దించారు. భారత నౌకాదళం, వాయుసేనలలో ఎంపిక కావాలంటే ప్రవేశ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించాలని ముఖ్యంగా గణిత, భౌతిక శాస్త్రాలలో పట్టు ఉండాలని తెలిపారు. ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు అత్యుత్తమ పర్సంటేజి మార్కులతో నేరుగా ఎలా ప్రవేశం పొందవచ్చో వివరించారు. ఈ సందర్భంగా ఎన్‌డిఎ, షార్ట్ సర్వీస్ కమీషన్ పోటీ పరీక్షలకు ఎలా సిద్ధం అవ్వాలో ఆయన వివరించారు. గీతం నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు రక్షణ దళాలలో ప్రవేశానికి ఆసక్తి చూపడం పట్ల అభినందించారు. కార్యక్రమంలో జిసిజిసి అసిస్టెంట్ డైరక్టర్ జి.రామముర్తి పాల్గొని ప్రసంగించారు.

ప్రకృతి సంపద ప్రజలందరికీ చెందాలి

- ఉచిత ఇసుక విషయంలో అక్రమాలను సహించం
- మంత్రి కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రకృతి ప్రసాదించిన వనరుల్ని ప్రతి ఒక్కరికీ చెందేలా చూసుకునే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ మేరకు విశాఖపట్నంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాల మైనింగ్ అధికారులు, క్వారీ నిర్వాహకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రతి మైనింగ్ నిర్వాహకుడు గత ఐదేళ్లు బాధితుడేనని, అడ్డగోలు నిబంధనలతో ప్రగతి పథంలో నడపాల్సిన మైనింగ్ వ్యవస్థను అధ్వాన్నంగా తయారు చేశారన్నారు. అధికారం శాశ్వతం అనే మత్తులో వ్యవస్థల్ని భ్రష్టుపట్టించారని, అధికారుల్ని అడ్డగోలుగా వాడుకున్నారన్నారు. రాష్ట్రం ఏమైపోయినా పర్లేదని, తమ జేబులు నిండితే చాలు అనేలా వ్యవహరించారని, గత ఐదేళ్లు మైనింగ్ వ్యవస్థలో ప్రతి స్థాయిలోనూ కొంతమంది రాజకీయ ప్రమేయంతో దోచుకున్నారన్నారు. విశాఖ నగరంలో అభివృద్ధిని గాలికొదిలేసి మరీ దోపిడీలకు తెరలేపారన్నారు. మైనింగ్ వ్యవస్థ మొత్తాన్ని ప్రక్షాళన చేసి మెరుగైన పాలనకు శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. గత ఐదేళ్లు కూడా డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ విషయంలో ఎలాంటి స్పష్టత లేకుండా పోయిందని, ఇప్పుడు దాన్ని స్థానిక అవసరాలకు వినియోగించేలా స్పష్టమైన నిర్ణయం తీసుకున్నామన్నారు. అదే సమయంలో క్రషర్ యజమానులు, మైనింగ్ కంపెనీల యజమానులతో సీనరేజి వసూలు చేసే సంస్థలు సఖ్యతతో నడచుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఉచితంగా ఇసుక అందించాలనే లక్ష్యంతో జులై 8న పాలసీ ప్రకటించినా.. గత ప్రభుత్వ వైఫల్యాల కారణంగా ఎన్జీటీలో కేసులు నడుస్తున్నాయని, ఫలితంగా తవ్వకాలు చేయలేకపోయామన్నారు. మరోవైపు వరుసగా వస్తున్న వర్షాల కారణంగా రాష్ట్రంలో ఇసుక తవ్వకాలను ప్రారంభించలేని పరిస్థితి నెలకొందన్నారు. దాన్ని చెలువలు పలువలు చేస్తూ ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా సీనరేజి, జీఎస్టీని కూడా రద్దు చేసి మరీ ప్రజలకు ఉచితంగా ఇసుక అందిస్తున్నామన్నారు. ప్రకృతి వనరులన్నీ ప్రజలకు అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

ఇద్దరు ఉద్యోగులు సస్పెండ్

విశాలాంధ్ర - సింహాచలం: సింహాద్రి అప్పన్న సెంట్రల్ స్టోర్స్‌లో 15 కేజీల జీడి పప్పు డబ్బా స్టోర్స్ నుండి బయటకు ఎందుకు,..ఎవరు ఎలా తీసుకెళ్లారు, అనే విషయంపై ఈఓ త్రినాథరావు సీసీ టీవీని పరిశీలించి ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. అనంతరం ఈఓ ప్రసాద విక్రయ కేంద్రానికి వెళ్ళి ప్రసాదాల స్టాక్, నాణ్యత పై ఆరా తీశారు. అయితే అప్పన్న దేవస్థానం పరువు విషయంలో సిబ్బంది అధికారులు క్షుణ్ణంగా అధ్యయనం, పరిశీలన చేసి అసలు తప్పు ఎక్కడ మొదలైంది అన్న విషయంపై తన, పర బేధం, ఎటువంటి ఒత్తిళ్ళకు లొంగకుండా సంబంధిత విభాగం సిబ్బందిపై క్రమ శిక్షణా చర్యలు తీసుకోవాలని అంటున్నారు. సస్పెండ్ క్రమ శిక్షణా చర్యలతోపాటు స్వామివారి నిత్యాన్న ప్రసాద పథకం లేదా వేరే ఏదైనా పథకానికి రూ. 1,116/-లు విరాళం వ్రాయమని ఆదేశించేలా చేయాలని భక్తులు కోరుకుంటున్నారు. గతంలో దివంగత ఈఓ సి.ప్రేమ్ కుమార్ తప్పు చేసిన ప్రతి ఉద్యోగికి విరాళం వ్రాయించి ఆ రసీదు తనకు చూపించనని అనేవారని కొంత మంది సిబ్బంది అంటున్నారు.

పోర్ట్‌లో జాతీయ ఐక్యతా దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని విశాఖపట్నం పోర్ట్ ఆధ్వర్యంలో సాలిగ్రామపురంలోని పోర్ట్ సీఐఎస్ ఎఫ్ కాంప్లెక్స్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. భారత దేశాన్ని ఏకీకృతం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. పోర్ట్ చైర్ పర్సన్ డా ఎం.అంగముత్తు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐక్యతా పరుగు(రన్ ఫర్ యూనిటీ)ను చైర్ పర్సన్ ప్రారంభించారు. పోర్ట్ సీఐఎస్ఎఫ్ యూనిట్, పోర్ట్ క్రీడా విభాగం అధ్వర్యంలో ఐక్యతా పరుగును నిర్వహించారు. దేశ సార్వభౌమత్వాన్ని ఐక్యతను ప్రతిబింబించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత్ నుంచి ఒలింపిక్స్‌కు ప్రాతినిధ్యం వహించిన పోర్ట్ హైస్కూల్ పూర్వ విద్యార్థిని, యూత్ ఐకాన్ జ్యోతి ఎర్రాజీని ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సత్కరించారు. జ్యోతిని ప్రోత్సాహించడంతోపాటు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు ప్రోత్సాహకం కింద 5 లక్షల రూపాయల చెక్‌ను చైర్ పర్సన్ డా ఎం.అంగముత్తు ఆమెకు అందజేశారు. డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్ కుమార్ దుబే, సిఐఎస్ఎఫ్ కమాండెంట్ సతీష్ కుమార్ బజ్‌పాయి, పోర్ట్ విభాగాధిపతులు, ఉద్యోగులు, క్రీడా విద్యార్థులు పాల్గొన్నారు. పోర్ట్ కార్యదర్శి టి.వేణుగోపాల్ ఈ వివరాలను మీడియాకు తెలియజేశారు.

రెవెన్యూ సేవలను మరింత విస్తృతం చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రెవెన్యూ సేవలను మరింత విస్తృతం చేయాలని, అధికారులు, సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. రామాటాకీస్ జంక్షన్ వద్ద గల అంబేద్కర్ భవన్‌లో మంగళవారం ఉదయం జరిగిన విశాఖ డివిజన్ రెవెన్యూ కాన్ఫరెన్స్‌లో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలని, ప్రజలకు సత్వరమే సేవలను అందించాలని సూచించారు. కాలయాపన చేయకుండా నిర్ణీత సమయంలోగా సమస్యలకు పరిష్కారం చూపాలని చెప్పారు. కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు జవాబుదారీతనం ఉండేలా పని చేయాలని పేర్కొన్నారు. ధృవీకరణ పత్రాల జారీ, ఏవైనా ప్రజా సమస్యలపై విచారణ, ఇతర ప్రక్రియల్లో పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు పెట్టకుండా సులభతర రీతిలో సేవలను అందించాలని, వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్.భవానీ శంకర్, మోహన్ కుమార్, విశాఖపట్టణం ఆర్డీవో పి.శ్రీలేఖ పాల్గొన్నారు.

రాజకీయ స్ఫూర్తికి ఆదర్శం నారాయణరావు

విశాలాంధ్ర - భీమిలి: భీమిలిలో విలువలతో కూడిన రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచి ఎంతోమంది యువతకు రాజకీయ చైతన్యం కల్పించిన గొప్ప పొలిటికల్ చాణక్యుడు మొకర నారాయణరావు అని భీమిలి జోన్ 3వ డివిజన్ అధ్యక్షులు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. చిన్న బజార్ జంక్షన్ జూనియర్ కళాశాల వద్ద ఉన్న మొకర నారాయణరావు నిలువెత్తు విగ్రహానికి గంటా నూకరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భీమిలి ప్రజలలో వచ్చిన రాజకీయ స్ఫూర్తికి ఆదర్శం నారాయణరావు అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాసరపు నాగరాజు, అర్ధపాకల గురునాథ్, జలగడుగుల మురళి, కొక్కిరి అప్పన్న, వాడమొదలు సత్యారావు, గండి బోయిన పోలిరాజు, రాజగిరి రమణ, కుప్పిల గురుమూర్తి, వియ్యపు పోతురాజు, బొడ్డు రమేష్, మహేష్, వాసుపల్లి వంశీ, శ్రీనివాసరావు మాస్టర్, కె.ఎస్.ఆర్. కృష్ణారావు మాస్టర్, కనకల సన్యాసిరావు, వాసుపల్లి వంశీ, మట్టా దాసు, పీరుపిల్లి రాజు నాయుడు, శంకర్ రెడ్డి, దేవుళ్ళు, వాడమొదలు తవుడయ్య, చింతకాయల అశోక్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

పాలవలసలో గెడ్డ స్థలం మాయం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని పాలవలస పంచాయతీ పరిధిలో ఉన్న గెడ్డను ఆక్రమణ చేసి మంగళవారం చదును చేశారు. సర్వేనెంబర్ 39/4లో ఎగువ పాలవలస నుండి గత 20 సంవత్సరాలుగా ఉన్న వాగు దిగువ పాలవలసకు వెళ్లే వర్షాధార నీరు సుమారు 10 అడుగుల లోతు, 12 అడుగులు వెడల్పు ఉన్న ఈ గెడ్డను మంగళవారం కొంతమంది జేసీబీతో చదును సేసి పనులు చేపడుతున్నారు. ఏదో నామామాత్రమే చిన్నపాటి కాలువను తీశారని స్థానికులు చెబుతున్నారు. సర్కారు గెడ్డలు ఆక్రమణకు పాల్పడితే భవిష్యత్ తరాలకు వర్షపు నీరు పోవడానికి వీలు లేకుండా పోతుందని, రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయి పరిశీలన జరపాలని స్థానికులు కోరుతున్నారు.

విజన్ ట్రీ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం శొంత్యం గ్రామంలో గల శ్రీ వెంకట్ విద్యాపీఠ్ పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం "ఆరోగ్యవంతమైన భారతదేశం" అనే కార్యక్రమంలో భాగంగా విజన్ ట్రీ కంటి ఆసుపత్రి ఎం.డి డాక్టర్ మధు ఉద్దరాజు (ఎమ్.ఎస్) ఆధ్వర్యంలో ఉచిత కంటి చెకప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా 350 మంది విద్యార్థులకు పరీక్షలు జరిపామని 11 మందికి కంటి అద్దాలు అవసరం ఉన్నందున కంటి హాస్పిటల్‌లో ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రొంగలి వెంకటేశ్వరరావు, పాఠశాల కరస్పాండెంట్ పద్మ, ప్రిన్సిపాల్ సత్యవేణి, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 7న ఏయూ పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశం

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యా లయం పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశం 2024ను డిసెంబర్ 7వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలుమ్నీ అసోసియేషన్ ఛైర్మన్ డాక్టర్ ఇ.శంకర్రావు తెలిపారు. మంగళవారం ఉదయం ఏయూ ఆలుమ్నీ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ సంవత్సరం ఆలుమ్నీ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎల్ అండ్ టి గ్రూప్ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, ప్రత్యేక అతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎస్.వి.ఆదినారా యణరావు హాజరుకానున్నట్టు తెలిపారు. ఈ సదస్సుకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, హ్యూమన్ రిసోర్స్ డెవల ప్మెంట్ శాఖ మంత్రి నారా లోకేష్ హాజరు కానున్నట్లు తెలియజేశారు. బీచ్ రోడ్‌లోని ఏ.యు కన్వెన్షన్ సెంటర్లో మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఈ కార్య క్రమం జరుగుతుందని తెలిపారు. ఏయూ ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ని ఆవిష్కరించారు. విద్యార్థులు నేటి తరంతో తమ అనుభవాలను, జ్ఞానాన్ని, అనుబంధాన్ని పెంచుకోవడానికి ఒక వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జి.ఎం.రావు, ఏయూ అలుమ్ని అసోసియేషన్ వైస్ చైర్మన్ డాక్టర్ కె.కుమార్ రాజా, రెక్టర్ ఆచార్య ఎన్. కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, డాక్టర్ ఎస్.కె.ఇ అప్పారావు, ఆకుల చంద్రశేఖర్ ప్రిన్సిపల్స్ తదితరులు పాల్గొన్నారు.

యదేచ్ఛగా గెడ్డ వాగులో అక్రమ కట్టడాలు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని గంభీరం గ్రామపంచాయతీ పరిధి బీసీ కాలనీ, విద్యుత్ ఆఫీస్ వెనుక వర్షాధార గెడ్డ వాగు సర్వేనెంబర్ 173లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. వర్షాధార ప్రభుత్వ వాగును కూడా ఆక్రమణదారులు వదలడం లేదు. వాగులో డబ్బరీస్, మట్టితో పూర్తిస్థాయిలో కప్పేసి నిర్మాణాలు చేపడుతున్నారు. ఒక్కోటిగా నిర్మాణాలు చేపట్టి స్థానిక నాయకులకు తాయిలాలు ఇచ్చి వారి పనులకు ఆటంకం లేకుండా నిర్మాణాలు పూర్తి చేసుకుంటున్నారని వాపోతున్నారు. ప్రస్తుత రోడ్డుకు ఆనుకొని ఉన్న వాగును కూడా కప్పేసి నిర్మాణాలు చేపట్టే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారని స్థానికలు చెబుతున్నారు. ఇప్పటివరకు సుమారుగా 20 నుంచి 30 ఇళ్ల వరకు నిర్మాణాలు చేపట్టి క్రయవిక్రయాలు జరుపుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సర్కారు వాగులలో నిర్మాణాలు చేపట్టకుండా భవిష్యత్ తరాలకు ఉపయోగపడే గెడ్డ వాగులను వర్షాధార నీరు పోయే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని, వాగులను రక్షించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, కాబట్టి వాగులను రక్షించి అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను వెంటనే తొలగించి, వాగులను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై స్థానిక వీఆర్ఓ రంభను వివరణ కోరగా పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి వివరాలు తెలియపరుస్తామని చెప్పారు.

పారదర్శకంగా నర్సింగ్ స్కూల్ సీట్లు ఎంపిక

310 సీట్లను ఆమోదించిన సెలక్షన్ కమిటీ

- కమిటీ చైర్మన్ పి.శివానంద వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న ఆరు ప్రధాన ప్రభుత్వ నర్సింగ్ స్కూల్లో ఉచిత సీట్లును ధృవీకరించడమే కాకుండా, అభ్యర్థుల మెరిట్ జాబితాను ఎక్కడా ఎటువంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా చేపట్టామని కవి టీ చైర్మన్, కేజీహెచ్ సూపరిండింటెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. మంగళవారం కె జీహెచ్ సమావేశ మందిరంలో ఆరు నర్సింగ్ స్కూల్కు సంబంధించి 310 సీట్లు భర్తీ వి షయంపై అభ్యర్థుల నుంచి వచ్చిన దరఖాస్తులను ఆరు నర్సింగ్ కాలేజీల నర్సింగ్ సూపరిండింటెంట్లు, కాలేజీ ప్రిన్సిపాల్ల సమక్షంలో ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదించినట్టు తెలిపారు. అయితే కేజీహెచ్ నర్సింగ్ స్కూల్కి 60సీట్లు, కాకినాడ స్కూల్కి 50సీట్లు, గుంటూరు కి 60 సీట్లు, విజయవాడకి 30సీట్లు, ఒంగోలుకి 60సీట్లు, ఏలూరు స్కూల్ ఆఫ్ నర్సింగ్కి 50 సీట్లుకు సంబంధించి ప్రక్రియను పూర్తి చేశారు. దరఖాస్తుల్లో వచ్చిన మెరిట్ జాబితా ప్రకారం ఆయా విద్యార్థులకు సీట్లు కేటాయింపు జరగుతుందన్నారు. ఈ సమావేశంలో సెలక్షన్ కమిటీ సభ్యురాలు డాక్టర్ ఎఎన్.లావణ్యకుమారి, గుంటూరు డిప్యూటీ సూపరిండింటెంట్ డాక్టర్ బి.రమేష్ కుమార్, విజయవాడ సూపరిండింటెంట్ డాక్టర్ డి. వెంకటేశ్వరరావు, ఒంగోలు ఆసుపత్రి డిప్యూటీ సూపరెండింటెంట్ డాక్టర్ ఎం.ప్రభాకర్, ఏలూరు ఆసుపత్రి సూపరిండింటెంట్ డాక్టర్ సివాచ్.సుధాకర్, సభ్యులు సిహెచ్. రాజకుమారి, పి. ఆశాదేవి. కె. సుజాతరాణి,ఎ.వి మల.ఎ.నాగేశ్వరరావు, ఎస్వి వరలక్ష్మీ, నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభ్యున్నతే లక్ష్యంగా పనిచేసే పార్టీ టిడిపి

- రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర - విశాఖ సిటీ: రాష్ట్ర అభ్యున్నతే లక్ష్యంగా పనిచేసే పార్టీ టిడిపి అని రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం జిల్లా టిడిపి కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా టిడిపి అధ్యక్షుడు గండి బాబ్జి లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ పార్టీకి, ప్రజలకు అనుసంధానంగా ప్రభుత్వం నడవాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు విధానమన్నారు. ప్రతిపక్షంలో ఉన్న, అధికా రంలో ఉన్నా ప్రజల కోసం ఆలోచించేది టీడీపీ మాత్రమేఅన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన రోజు నుండి ప్రజల కోసమే అహర్నిశలు పని చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నదే టీడీపీ లక్ష్యం అని స్పష్టం చేశారు. పార్టీ సభ్యత్వ నమోదును క్రియాశీలకంగా నిర్వహించాలని టిడిపి శ్రేణులకు సూచించారు. కార్యకర్తల కోసం సంక్షేమ నిధి ఏర్పాటు చేసిన ఏకైక పార్టీ టీడీపీ మాత్రమేనన్నారు. పార్టీ కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండాలని, ప్రజల సమస్యలు పరిష్కరించాలని అప్పుడే ప్రజలు ఇచ్చిన తీర్పుకు న్యాయం చేసిన వాళ్ళం అవుతామని అన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అధికారం లోకి వచ్చాం కదా అని విశ్రమ స్థితిలో ఉండకూడదు, అప్రమత్తత అవసరం అన్నారు. 2029లో కూటమిని అధికారంలోకి తీసుకురావడానికి ఇప్పటి నుంచే ప్రయత్నం చేయాలన్నారు. నాయకులు ఆశిస్తున్న స్థాయి లో అధిష్టానం నిర్ణయాలు ఉంటాయని పేర్కొన్నారు.

ప్రజలు ఆకాంక్షకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన ఉంది అని అన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఏం శ్రీ భరత్, తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, శాసన మండలి సభ్యులు దువ్వారపు రామారావు, దాడి రత్నాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఓమ్ని ఛానల్ పండుగ వ్యూహాన్ని ఆవిష్కరించిన ప్రీతి

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశంతో పాటు ఆసియాలోనే అత్యంత శక్తివంతమైన మిక్సర్ గ్రైండర్గా గుర్తింపు పొందిన ప్రీతి జోడియాక్‌కు వెర్పుని ఇండియాకు చెందిన ఒక ప్రముఖ మిక్సర్ గ్రైండర్ బ్రాండ్ ప్రీతి కిచెన్ అప్లయెన్సెస్. "ప్రీతి-కి నేను గ్యారెంటీ" అనే భరోసాతో ఒక అద్భుతమైన నూతన టీవీ వాణిజ్య ప్రకటనను విడుదల చేసింది. తమ వినియోగదారులతో మరింత దృఢమైన సంబంధాన్ని ఏర్పరచుకునేందుకు ఈ ప్రకటన ద్వారా తమ మిక్సర్ గ్రైండర్ ప్రతి ఇంటిలోని రోజువారీ దినచర్యలలో ఎలా అల్లుకుపోయిందో చాటిచెబుతుంది. ఈ సరికొత్త టీవీసీ ప్రీతి జోడియాక్ యొక్క అత్యున్నత సామర్థ్యాలతో పాటు దాని శక్తివంతమైన పనితీరును ప్రదర్శిస్తుంది.

ఈ ప్రకటన ద్వారా ప్రీతి జోడియాక్ వంటగదిలోని కష్టమైన రోజువారీ చర్యలను ఎంతో సులభంగానూ మరియు ఆహ్లాదకరంగానూ మారుస్తుంది అని చెబుతుంది. అత్యధిక నాణ్యమైన మరియు మన్నికైన ప్రీమియం ఉత్పత్తులకు ప్రతీకగా ప్రీతి బ్రాండ్ ఎదిగింది. ఈ నూతన ప్రకటనలో సెలబ్రిటీలు అల్యా మానస, సంజీవ్ కార్తీక్‌లు నటించారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్య అడ్మిషన్లు మంగళవారం అత్యధికంగా జరిగాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేఆర్‌కే పట్నాయక్ తెలిపారు. ఆనందపురం హైస్కూల్ మంగళవారం ఓపెన్ స్కూల్ అమరావతి సూపర్ ఇండెంట్ గోపికృష్ణ పాఠశాలను సందర్శించి ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యావంతులు చేయడానికి

ఓపెన్ స్కూల్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ పట్నాయక్ మాట్లాడుతూ బుధవారం వరకు మాత్రమే దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. 10వ తరగతి ఓపెన్ స్కూల్ 220 దరఖాస్తులు ఇంటర్ 80 ,ఎంపీసీ, బైపిసి 84 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. మంగళవారం ఒకరోజే 20 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ ఏ 1 కోఆర్డినేటర్ మురళి మోహన్ , జయ వర్మ , ప్రధాన ఉపాధ్యాయులు కె.రామకృష్ణరావు పట్నాయక్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బి.ఎస్.రెడ్డికి 'డాక్టర్ ఆఫ్ మ్యాజిక్'

విశాలాంధ్ర- విశాఖపట్నం: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన భారతీయ మహేంద్ర జాలికుడు బి.ఎస్. రెడ్డి కి డాక్టర్ ఆఫ్ మ్యాజిక్ అవార్డు లభించింది. ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకూ ఐదురోజులపాటు అంగరంగ వైభవంగా జరిగిన 'థాయిలాండ్ ఇంటర్నేషనల్ మ్యాజిక్ ఎక్స్ట్రా వగంజా-2024' పేరిట బ్యాంగ్‌కాక్ లో నిర్వహించిన ప్రపంచ స్థాయి మ్యాజిక్ కన్వెన్షన్‌లో భారత దేశం తరపున ఐదు రోజులూ జ్యూరీ(జడ్జి)గా బి ఎస్ రెడ్డి వ్యవహరించారు. ఈ వేడుకల్లో జపాన్, అమెరికా, చైనా, ఆస్ట్రేలియా, ఇండియా, ఇరాన్, కువైట్, కొరియా, థాయిలాండ్, ఫిలిప్పైన్స్, హాంగ్‌కాంగ్, వియత్నాం, సింగపూర్, థైవాన్, మొరాకో తదితర దేశాలకు చెందిన 150 మంది మెజీషియన్ ప్రతినిధులు పాల్గొన్నారు. అమెరికాకు చెందిన ఇంటర్నేషనల్ మెజీషియన్స్ సొసైటీ- మ్యాజిక్ అకాడెమీ నిర్దేశించిన కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన బి.ఎస్. రెడ్డికి డాక్టర్ ఆఫ్ మ్యాజిక్ డిప్లమా యోగ్యతా పత్రాన్ని, బంగారు పతకాన్ని సొసైటీ ఛైర్మన్ టోనీ హస్సినీ (యూఎస్‌ఏ) చేతులమీదుగా అందజేశారు.

అధిక రేట్లకు బాణసంచా విక్రయాలు

విశాలాంధ్ర,పలాస/మందస: దీపావళి పండగ అంటే పండు ముదుసలి నుండి చిన్నారులందరికీ సరదా పండుగ. దీపావళి రాత్రి ప్రతి చోటా బాణాసంచా కాల్పుల సందడే. ధనవంతుడు నుండి పేదల వరకు వారి వారి స్థాయిని బట్టి బాణాసంచాను కొనుగోలు చేసుకుని కాల్చుతుంటారు. దీనిని ఆసరాగా చేసుకుని బాణాసంచా అమ్మకం దారులు కొనుగోలుదారుల నుండి నిలువు దోపిడీ చేస్తుంటారు. పండుగ సందర్భంగా తప్పనిసరి పరిస్థితులలో వ్యాపారులు ఎంత ధర చెప్పినా ప్రజలు కొనక తప్పడం లేదు. పలాస నియోజకవర్గం పరిధిలో పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ తో పాటు మందస పలాస వజ్రపుకొత్తూరు మండలాల్లో దీపావళి సందర్భాన్ని పురష్కరించుకొని బాణాసంచా సామాగ్రిని అధిక రేట్లకు ప్రజలకు అమ్మకాలు చేసి ఆర్థిక దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా లైసెన్స్ పొందిన వ్యాపారులు తమ ఇష్టారాజ్యంగా అధిక రేట్ల అమ్మకాలు చేస్తుండగా ఎటువంటి అనుమతులు లేకుండా చట్ట విరుద్ధంగా ఒడిస్సా పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుండి లక్షలాది రూపాయలు విలువగల సరుకులను అనేక మంది వ్యాపారులు రైళ్లు, లారీల ద్వారా దిగుమతులు చేసుకున్నారు. ప్రస్తుతం ఎక్కడికక్కడ గోదాం లలో సరుకులు నిల్వ చేసి టెక్కలి నరసన్నపేట తదితర ప్రాంతాలకు కూడా ఇక్కడ వ్యాపారులు సరఫరా చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా గ్రామాల్లోని

చిరు వ్యాపారులకు కూడా బాణసంచా సామాగ్రిని బడా వ్యాపారులు సరఫరా చేశారనే ఆరోపణ వినిపిస్తున్నాయి. బాణాసంచా సామాగ్రి వ్యాపారం జరుగుతున్న తీరుపై సంబంధిత అధికారుల నిఘా లేకపోవడంతో అధిక రెట్లకు విచ్చలవిడిగా అమ్మకాలు జరుపుతున్నారని కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. కొంతమంది వ్యాపారులు సిండికేట్ గా ఏర్పడి అధిక ధరలకు విక్రయాలు చేయడం వలన పేద సామాన్య మధ్యతరగతి ప్రజలు దీపావళి సంబరాలను బాణాసంచా లేకుండా మొక్కుబడిగా జరుపుకునే పరిస్థితి ఏర్పడింది.మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది బాణాసంచా సామాగ్రి రేట్లు అధికంగా ఉన్నాయని ప్రజలు అంటున్నారు. కాబట్టి దీపావళి బాణాసంచా సామాగ్రి సాధారణ ధరలకు విక్రయాలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏపీని అన్ని రకాల అభివృద్ధి చేయాలి

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: కేంద్రంలో, ఆంధ్రప్రదేశ్‌లో డబుల్ ఇంజిన్ పాలన కొనసాగుతున్నందువల్ల గతంతో పోలిస్తే ఏపీని రెట్టింపు స్థాయిలో అన్ని రకాల అభివృద్ధి చేసుకునే అవకాశాలున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. రాజకీయాలను, వంతాలు, పట్టింపులను పక్కనపెట్టి అభివృద్ధికి సహకరించాలని, తద్వారా ప్రజల ఆకాంక్షలను నెరవేరుద్దామని పిలుపునిచ్చారు. ఏపీలో అనేక ప్రసిద్ధ ఆలయాలు, పర్యాటక ప్రదేశాలున్నందున పర్యాటక రంగంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఎన్ని విమర్శలొచ్చినా లెక్క చేయకుండా అనుకున్న లక్ష్యాన్ని అధిగమించేలా అహర్నిశలు పనిచేస్తున్న మహనీయుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అని కొనియాడారు. మోదీ కృషి ఫలితంగా ఆర్థిక ప్రగతిలో భారత్ 5వ స్థానానికి చేరుకుందన్నారు. 2028 నాటికి భారత్ మూడో స్థానానికి చేరుకోవడం తథ్యమన్నారు. మోదీ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు 10 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయబోతోందని, ఇప్పటికే దాదాపు 8 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. మంగళవారం ఉదయం విశాఖపట్నంలో నిర్వహించిన "రోజ్ గార్ మేళా" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండి సంజయ్ ఈ సందర్భంగా తన చేతుల మీదుగా 110 మందికి ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంపీ భరత్, స్థానిక మేయర్, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. దేశవ్యాప్తంగా 51 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్నారని, మోదీ ప్రధాని కాకముందు ప్రపంచ ఆర్థిక ప్రగతిలో మనదేశం 11వ స్థానంలో ఉండేదన్నారు. ఈరోజు 5వ స్థానంలోకి అడుగుపెట్టామని, మరో 4 ఏళ్లలో అంటే 2028 నాటికి ఆర్థిక ప్రగతిలో భారత్ మూడో స్థానానికి చేరుకుని అమెరికా, చైనాతో పోటీ పడాలనే ముందుకు సాగుతున్న మహానుభావుడు నరేంద్రమోదీ అన్నారు. "ఆత్మనిర్భర భారత్" అంటే మన దేశం అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా ప్రతి ఒక్కరూ తమ కాళ్లపై తాము నిలబడటమేనని, ఆత్మ నిర్భర భారత్. కరోనాతో ప్రపంచమంతా వణికిపోయిందని, అమెరికా వంటి అగ్రదేశం కూడా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. ఎన్ని విమర్శలొచ్చినా అధిగమిస్తూ నిర్ణీత లక్ష్యాల కోసం పనిచేస్తున్న క్రుషీవలుడు నరేంద్రమోదీ అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడమే కాకుండా దాదాపు రూ.13,500 కోట్లు కేంద్రం ఇప్పటి వరకు మంజూరు చేసిందని, అమరావతి డెవలెప్ మెంట్ కోసం రూ.15000 కోట్లు ఇవ్వబోతున్నామన్నారు. ఇప్పటికే 3 వేల కోట్లు విడుదల చేసినం. కేంద్ర భాగస్వామ్యంతో అమరావతి ఔటర్ రింగ్ రోడ్డును ఏర్పాటు చేసుకోబోతున్నామన్నారు. భూసేకరణ అయ్యే ఖర్చులో కేంద్ర రాష్ట్రాలు సగం సగం భరించాలని, కానీ రాష్ట్ర పరిస్థితి దృష్ట్యా పూర్తిగా కేంద్రమే భరిస్తుందన్నారు. నేషనల్ హైవేస్ విశాఖపట్నం రాయపూర్ ఎక్స్ ప్రెస్ హైవే... ఇదో గేమ్ ఛేంజర్ అని ఇది పూర్తయితే వైజాగ్ రూపరేఖలే మారతాయన్నారు. విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్టల్ రైల్వే జోన్ ఏర్పాటు చేసుకోవడంతోపాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భద్రాచలం - కొవ్వూరు, కాళహస్తి-నడికుడి, కోటిపల్లి-నర్సాపురం, రాయదుర్గం-రాయచూర్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం నిధులిస్తోందన్నారు. విమానయాన రంగం విషయానికొస్తే.... ఆ శాఖ మంత్రి ఉత్తరాంధ్రకు చెందిన వ్యక్తేనని భారీ ఎత్తున విమానాశ్రయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. వైజాగ్, విజయవాడ విమానాశ్రయాలను అంతర్జాతీయ విమానాశ్రయాలుగా అభివృద్ధి చేసే పనిలో ఉన్నారన్నారు. ఉత్తరాంధ్రలోని విజయనగరం జిల్లాలోని భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణానికి అనుమతి లభించిందని, విమానాశ్రయాల్లో మౌలిక వసతుల కోసమే వెయ్యి కోట్లకుపైగా ఖర్చు చేశామన్నారు. స్మార్ట్ సిటీ పథకం కింద విశాఖపట్నం, తిరుపతి, కాకినాడ, అమరావతి నగరాల అభివృద్ధి కోసం దాదాపు 8 వేల కోట్ల రూపాయలకుపైగా నిధులు మంజూరు చేసిందన్నారు. మొన్నటి కేబినెట్‌లోనే మొన్ననే అమరావతి మీదుగా రైల్వే లైన్ నిర్మాణానికి 2వేల 200 కోట్ల నిధులు కేటాయించేందుకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. సమావేశంలో ఎంపీ భరత్, మేయర్ హరి వెంకట కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎంజెపిలో అంతర్జాలంపై వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలో స్థానిక ఎంజెపిలో మంగళవారం ఈనాడు ఆధ్వర్యంలో ప్రతిభ పాటవ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలలో అంతర్జాలం వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఈనాడు కోఆర్డినేటర్ బి.భాస్కర్ ఆధ్వర్యంలో 80 మంది విద్యార్థులకు నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీలలో ప్రథమ స్థానం ఎల్ అక్షయ, ద్వితీయ స్థానం లాస్య శ్రీ, తృతీయ స్థానంలో కావ్య శ్రీ కైవసం చేసుకున్నారు. గెలుపొందిన

విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు పి సుధారాణి చేతులు మీదుగా ప్రశంసా పత్రాలు, మెమొంటెన్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు గాంధీ పుచ్చలపల్లి సుందరయ్య

ప్రజల కోసం పోరాడిన యోధులు

- స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో విగ్రహావిష్కరణ

- నివాళులు అర్పించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

విశాలాంధ్ర -శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: ప్రజల కోసం జ్వలించి కమ్యూనిస్టు గాంధీగా పేరుగాంచిన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తి చిరస్మరణీయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. విప్లవ జ్వాలా కిరణాలతో మానవత్వ పరిమళాలు వెదజల్లిన రైతాంగ పోరాట యోధుడుగా కీర్తిగాంచారన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, దక్షిణాభారత కమ్యూనిస్టు గాంధీగా పేరుగాంచిన పుచ్చలపల్లి సుందరయ్య నూతన విగ్రహాన్ని శ్రీకాకుళం నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తల స్మృతివనంలో మంగళవారం సీపీఎం నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు, ప్రజా సంఘాల ప్రతినిధులు సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో గాంధీజీ పిలుపునందుకొని పోరాట బాట పట్టిన పుచ్చలపల్లి సుందరయ్య కమ్యూనిస్టు భావజాలంతో అణగారిన ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. తన యావదాస్తిని ప్రజల కోసం ధారపోసి నిరాడంబర జీవితాన్ని కొనసాగించిన పుచ్చలపల్లి ఆశయం ఎప్పటికీ సజీవంగా నిలుస్తుందన్నారు. సీపీఎం రాష్ట్ర సభ్యులు బెండి తులసీదాస్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో మహనీయులు సరసన అత్యంత ప్రతిభావంతమైన వ్యక్తి సుందరయ్య విగ్రహం ప్రతిష్ఠించడం అభినందనీయమన్నారు. ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ సమరయోధులు, సంఘ సంస్కర్తల స్మృతివనం తనకెంతో స్ఫూర్తిని కలిగించిందన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య జీవితం భావితరాలకు ఆదర్శనీయమన్నారు. సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావు మాట్లాడుతూ కమ్యూనిస్టు స్ఫూర్తిని అణువణువున నింపుకొని జీవన విధానంగా మలుచుకున్న

పుచ్చలపల్లి సుందరయ్య నిత్య స్మరణీయులని కొనియాడారు. అనంతరం విగ్రహదాత వి.జి.కె. మూర్తి, శిల్పి దివిలి హేమచంద్రలను సత్కరించారు. గాంధీ మందిర ప్రతినిధులు ఎం.ప్రసాదరావు, జామి భీమశంకర్, కొంక్యాన మురళీధర్, కొంక్యాన వేణుగోపాల్, నటుకుల మోహన్ బృందం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావును సత్కరించారు. అవధాన పండితులు పైడి హరనాథరావు పుచ్చలపల్లి సుందరయ్య కీర్తిని గానం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు బవిరి కృష్ణమూర్తి, డి.గోవిందరావు, కె.శ్రీనివాస్, వై.చలపతిరావు, కె. మోహన్ రావు, కొత్తకోట అప్పారావు, కె.నాగమణి, మహాలక్ష్మీ, డబ్బీరు గోవింద్, గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు నక్క శంకరరావు, గుత్తు చిన్నారావు, మహిబుల్లాఖాన్, కొమ్ము రమణమూర్తి, పందిర అప్పారావు, మెట్ట అనంతంభట్లు తదితరులు ఉన్నారు.

పేదలందరికీ ఉచిత సిలిండర్లు దక్కేనా..?

విశాలాంధ్ర - పలాస: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేర్చేందుకు ముందుకు అడుగులు వేస్తోంది. సూపర్ సిక్స్ పథకంలో భాగంగా తెలుపు రంగు రేషన్ కార్డు(బియ్యం కార్డు) ఉన్న నిరుపేదలందరికీ దీపావళి నుండి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని దీనికై ఈ నెల 29వ తేదీ నుండి గ్యాస్ సిలిండర్ల కోసం ఆన్ లైన్‌లో నమోదు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో గ్యాస్ సిలిండర్ కోసం బియ్యం కార్డులు గల అర్హులైన వారంతా తమ పేర్లను నమోదు చేసుకుంటున్నారు. అయితే గ్యాస్ కనెక్షన్లు ఉంటూ బియ్యం కార్డులు ఉన్న వారందరికీ గ్యాస్ సిలిండర్లు దక్కే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పలాస నియోజవర్గం పరిధిలో పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీతోపాటు మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన వేలాది మంది గ్యాస్ కనెక్షన్‌దారులున్నారు. అయితే ఉమ్మడి కుటుంబాల్లోని పేదలు విడిపోయిన వారు, పెళ్లయిన నూతన వధూవరులు ప్రతి పంచాయతీలోనూ మున్సిపాలిటీ వార్డుల పరిధిలోను వందలాది మంది ఉన్నారు. వీరంతా కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఏడాది కాలంగా ఇటువంటి పేదలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు కాలేదు. కార్డుల కోసం ఎదురుచూస్తున్న వీరంతా ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి దూరంగా ఉండాల్సిన పరిస్థితులు పాలక వర్గాలే కల్పించాయి. బియ్యం కార్డు కలిగి గ్యాస్ కనెక్షన్ ఉన్న వారంతా గ్యాస్ పంపిణీ ఏజెన్సీల వద్ద ఈకేవైసీ చేసుకోవలసి ఉంది. దీనిపట్ల పేదలకు సరైన అవగాహన లేకపోవడం ఈకేవైసీ చేసుకోని వారు నియోజవర్గంలో వందలాది మంది ఉన్నారు. ప్రభుత్వం తప్పని సరిగా ఈకేవైసీ చేయడంతో చేసుకోని వారికి ఉచిత గ్యాస్ సిలిండర్లు దక్కే పరిస్థితులు కనిపించడం లేదని ప్రచారంలో ఉంది. అంతే కాకుండా బియ్యం కార్డు కలిగి వంట గ్యాస్ కనెక్షన్లు

ఉన్న కుటుంబాల్లో కనెక్షన్ పొందిన లబ్ధిదారులు మృతి చెందిన వారు నియోజవర్గంలో వందలాది మంది ఉన్నారు. కనెక్షన్‌దారులు చనిపోయిన తర్వాత వారి వారసుల పేరున గ్యాస్ కనెక్షన్లు మార్చాలి. దీనికై మరణ ధ్రువ పత్రం, కుటుంబ సభ్యుల ధ్రువ పత్రాలను అందజేసిన గ్యాస్ కంపెనీ ఏజెన్సీలు, దీనికి సంబంధించిన యంత్రాంగం పట్టించుకోలేదు. దీంతో ఇటువంటి బాధిత లబ్ధిదారులు కూడా ఉచిత వంట గ్యాస్ సిలిండర్లకు దూరమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇటువంటి అంశాలు పరిశీలిస్తే ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకానికి సంబంధించి సగం మందికి కూడా గ్యాస్ సిలిండర్ దక్కే పరిస్థితులు కనిపించక పోవడంతో పేదలు ఆందోళన చెందుతున్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ దొరుకుతుందన్న ఆశతో ఉన్న అనేక మంది అర్హులైనప్పటికీ గ్యాస్ సిలిండర్ దక్కే సూచనలు కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం దృష్టిసారించి పేదలకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.